

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో రబీకి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం నుంచి ప్రారంభిస్తామని ఎఒ ఎం,విశ్వాసరావు తెలిపారు. మండలంలో 11 వేల ఎకరాల్లో ఎంటియు-1121 వరి రకం అధికంగా సాగు చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో, మైత్రి సంఘాలు, టోల్ ఫ్రీ నెంబర్, కంట్రోల్ రూమ్‌లు, నలుగురు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రత్యేక అధికారి, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఎఒలను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ప్రస్తుతం సాధారణ రకం 75 కేజీలు రూ.1,637, 100 కేజీలు రూ.2,183గా నిర్ణయించామని వ్యవసాయ అధికారి తెలిపారు, ఈ సీజన్లో వెహికల్ జిపిఎస్ రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. 50 శాతం గోనె సంచులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు.

పతాక స్థాయికి డైలాగ్ వార్

మార్గాని, ఆదిరెడ్డి ఒకరిపై ఒకరు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు



భరత్ X వాసు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో రాజుకున్న అగ్గి పతాక స్థాయికి చేరింది. టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, వైసిపి అభ్యర్థి ఎంపీ భరత్‌రామ్ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలతో మొదలై వ్యక్తిగత విమర్శలకు సైతం పాల్పడటం రాజకీయ దిగజారుడుతనాన్ని దర్పణం పడుతోంది. 2019కి ముందు ఎటువంటి రాజకీయ నేపథ్యంలేని మార్గాని భరత్‌రామ్ ఎంపీగా గెలవడమే కాక ఆ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పార్లమెంటులో బాధ్యతలను నిర్వర్తించారు. గెలుపొందిన తొలి ఏడాది నుంచే పార్లమెంటు సభ్యుడిననే స్పృహను విస్మరించి కేవలం రాజమహేంద్రవరం సిటీకే పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా రాజమహేంద్రవరం సిటీ నుంచి ఎంఎల్‌ఎగా బరిలో తలపడనున్నారు. కొత్తగా వేసిన రోడ్లు, అభివృద్ధి చేసిన పార్కులు, ఓపెన్ ఎయిర్ థియేటర్ వంటివి తన కృషేనంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అయితే ఈ అభివృద్ధి పనుల్లో 25 శాతం కమీషన్ల కొట్టేశారంటూ టిడిపి ప్రచారం చేస్తోంది. భరత్‌రామ్ ఏ 25 శాతం కమీషన్ అంటూ ఏకంగా కరపత్రాలు పంపిణీ చేయడంతో రాజకీయ దుమారం లేచింది. పేదలందరికీ ఇళ్లు -జగనన్న కాలనీ కోసం కొనుగోలు చేసిన ఆవ భూముల్లో కోట్లాది రూపాయలు కమీషన్లను ఎంపీ భరత్ కొట్టేశారంటూ టిడిపి అధినేత చంద్రబాబు సైతం గతంలో జిల్లాలో నిర్వహించిన ఓ బహిరంగ సభలో విమర్శించిన విషయం విధితమే. రీల్స్ స్టార్ అంటూ చలోక్తులు సైతం విసిరారు. ఈ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలను వదిలేస్తానంటూ భరత్ రామ్ తీవ్రంగానే స్పందించారు. అయితే టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు మరో అడుగు ముందుకేసి ఎంపీ భరత్‌రామ్ ఐదేళ్ల పాలనలో బ్లేడు బ్యాచ్‌లను పెంచి పోషించారన్నారు. బంగారం, గంజాయి మాఫియాతో సంబంధాలున్నాయంటూ నిందితులు భరత్ రామ్‌తో దిగిన ఫొటోలు చూపిస్తూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. అదేస్థాయిలో ఎంపీ భరత్‌రామ్ కూడా నిందితులతో ఆదిరెడ్డి కుటుంబ కలిసి దిగిన ఫొటోలను చూపించడం ప్రజలను ఆలోచింపచేసింది. ఇరువురు నేతలకు సదరు వ్యక్తులతో పరిచయాలున్నాయనే విషయం సుస్పష్టం. ఇటీవల ఓ సమావేశంలో ఆదిరెడ్డి కుటుంబాన్ని వడ్డీల ఆదిరెడ్డి అని సంబోధించటంతో పాటు రాజమహేంద్రిలో నిర్వహించిన సిద్ధం సభలో ఆదిరెడ్డి పేరు చెప్పి చెప్పు తీసి చూపించడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ సంఘటనను టిడిపి, జనసేన సంయుక్తంగా ఖండిస్తూ ఒక మీడియా సమావేశం నిర్వహించడం, ఈ సందర్భంగా జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ ఘాటుగానే స్పదించారు. ఇదే సందర్భంగా ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తాను గనుక సైగచేస్తే 40 వేల చెప్పులు లేస్తాయని కౌంటర్ ఇచ్చారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఎంపీ భరత్ రామ్ న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయటంతో పాటు ఆదిరెడ్డిపై రూ.20 కోట్లకు పరువునష్టం దావా వేస్తాననడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరువురు యువనేతలు విద్యావంతులే అయినప్పటికీ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం మండిపడుతున్నారు. గతంలో అభ్యర్థులు ప్రతీ వీధులోనూ క్షేత్రస్థాయిలో తిరుగుతూ పాదయాత్రతో అన్నింటిని పరిశీలిస్తూ తాము చేసేవి, మ్యానిఫెస్టోలో తాము అమలు చేసేవి చెబుతూ ప్రచారాలు చేసేవారు. అయితే ఇప్పుడు అధునాతనమైన డిజిటల్ మాధ్యమాలు రావడంతో. అభ్యర్థులు చెప్పాలనుకున్నది, ఎదుట అభ్యర్థిపై విమర్శలు కూడా రికార్డు చేసి అడియో, వీడియో (ఏవీలు)లను ప్రదర్శిస్తున్నారు. ఈ పోటీ ప్రచారాలకు, విమర్శలకే పరిమితం కాలేదు. గత నెలలో సుబ్రహ్మణ్య మైదానంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. ఎంపీ భరత్ నిర్వహించిన సిద్ధం సభకు ధీటుగా ఆదిరెడ్డి వాసు నేతత్వంలో విఎల్ పురం సమీపం ఒని జెమిని గ్రౌండ్స్‌లో ఎన్నికల శంఖారావం సభను నిర్వహించారు. వాస్తవానికి ఎంపీ భరత్ సుబ్రహ్మణ్య మైదానంలో నిర్వహించిన సిద్ధం సభకు పోటీగానే టిడిపి శంఖారావం సభను కూడా ఆదిరెడ్డి వాసు స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో నిర్వహించాలని భావించారు. అయితే టిడిపి సభలు జరిగేందుకు వీలులేకుండా భరత్ రామ్ ముందస్తుగానే సుబ్రహ్మణ్య మైదానాన్ని 20 రోజుల పాటు బుక్ చేసుకున్నారు. దీంతో సుబ్రహ్మణ్య మైదానం ఖాళీ లేకపోవంతో టిడిపి నాయకులు శంఖారావం సభను జెమిని గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఇక నగరంలో కూడా భారీ హోర్డింగులను ఇప్పటికే వైసిపి నాయకులు బుక్ చేసుకున్నట్టు సమాచారం. దీంతో టిడిపి నాయకుల ప్రచారం కేవలం చిన్నపాటి హోర్డింగ్‌లకే పరిమితం అయ్యింది. విపక్ష పార్టీలైన టిడిపి, జనసేన పార్టీల ప్రకటనకు అవకాశం లేకుండా అధికార పార్టీ నేతలు ముందస్తుగానే వేదికలు, హోర్డింగ్స్ ముందస్తు బుకింగ్ చేసుకోవడం అధికార దుర్వినియోన్ని దర్పణం పడుతోంది.



మాట్లాడుతున్న చంద్రబాబు

వైసిపిని బంగాళాఖాతంలో కలిపేద్దాం

రోడ్ షోలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం, రావులపాలెం

వచ్చే ఎన్నికల్లో వైసిపిని బంగాళాఖాతంలో కలిపేద్దామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం ప్రజాగళంలో భాగంగా రావులపాలెం, రామచంద్రపురంలో ఆయన రోడ్‌షో నిర్వహించారు. రావులపాలెం, ద్రాక్షారామంలో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. ప్రజలను మోసగించిన వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. రాష్ట్రంలో పాలన చేతగాని ముఖ్యమంత్రి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ధరలను అదుపు చేయడం ముఖ్యమంత్రి జగన్‌కు చేతకాలేదన్నారు. నిత్యావసర ధరలు సామాన్యలకు అందనంత ఎత్తులో ఉన్నాయన్నారు. రూ.60 విలువైన చీప్ లిక్కర్‌ని రూ.200 లకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నారు. పూర్తి మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న ముఖ్యమంత్రి జగన్, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇసుక పాలసీ మరింత దారుణంగా తయారైందన్నారు. తమ హయాంలో రూ.1000 రూపాయలను ఇసుకను ఇప్పుడు రూ.5వేలకు పైగా విక్రయిస్తున్నారన్నారు. దళితుల పట్ల ముఖ్యమంత్రినకి చిత్త శుద్ధిలేదన్నారు. తమ హయాంలో ఎస్‌సిలకు మంచొ గుర్తింపునిచ్చామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌ను చేశామన్నారు. అదే చంద్రబాబు బ్రాండ్ అని ఆయన వ్యాఖ్యానించారు. తన హయాంలోనే హైదరాబాదును అభివృద్ధి చేశానని రాష్ట్రంలోనూ కియా మోటార్స్‌ను తీసుకువచ్చామని ఆయన గుర్తు చేశారు. ఒకటో తేదీని పింఛన్లు అందించడంలో విఫలమయ్యారన్నారు. తాము ఎన్నికల కమిషన్, ఛీఫ్ సెక్రటరీతో మాట్లాడానని, మూడో తారీకు వచ్చినా పింఛన్లు ఇవ్వలేదన్నారు. దీంతో వద్ధులు ఎంతో ఇబ్బందులు గురవయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆలోచించి ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాథూర్, రామచంద్రపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, కొత్తపేట అభ్యర్థి బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, నాయకులు రేవు శ్రీను, చిక్కల దొరబాబు, జనసేన పార్టీ నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జనం

2వ రోజుకు పేపరు మిల్లు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపి పేపరు మిల్లులో కార్మికులు చేపట్టిన ఆందోళన బుధవారం రెండో రోజుకు చేరింది. వేతన ఒప్పందం చేయాలని కోరుతూ మంగళవారం కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడంతో రెండో రోజూ మిల్లు లోపల ఆందోళనలు కొనసాగాయి. నిరసన కార్యక్రమంలో భాగంగా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడాలని నినదించారు. మిల్లులోని 11 గుర్తింపు కార్మిక సంఘాలు ఈ ఆందోళనలో పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టరు కె.మాధవీలత ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం వల్లి విచారించారు. యాజమాన్యంతోనూ, కార్మికులతోనూ మాట్లాడిన అనంతరం జెసిఎల్ రాణి దృష్టికి తీసుకెళారు. జెసిఎల్ ఆమె గురువారం మిల్లులోనే యాజమాన్యంతో చర్చలు జరుపనున్నారు.



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

అసత్య ప్రచారం సరికాదు

ప్రజాశక్తి-నల్లజర్ల

పెన్షన్ల ఆలస్యానికి చంద్రబాబు కారణమన్న హోంమంత్రి తానేటి వనితపై టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గం అభ్యర్థి మద్దిపాటి వెంకట్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత గల మంత్రిగా ఉండి ప్రతిపక్ష నాయకులపై అసత్య ప్రచారం సరికాదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజాధనాన్ని లూటీ చేశారనీ సొంత కాంట్రాక్టర్లకు నిధులు మళ్లించారన్నారు. పెన్షన్ల జాప్యానికి ప్రతిపక్షాలే కారణమంటూ విష ప్రచారం చేస్తున్నారనీ, ఎన్నికల కోడ్ వచ్చాక ప్రభుత్వ వ్యవస్థలన్నీ ఈసీ పరిధిలో ఉంటాయనే కనీస అవగాహన కూడా మంత్రి వనితకు లేదన్నారు. పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవుఅని, ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకొని పింఛన్ల పంపిణీపై దష్టిసారించాలినీ ఆయన హితవు పలికారు.

అన్నదేవరపేటలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - తాళ్లపూడి

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించి నిరుద్యోగ సమస్య నిర్మూలనతో పాటు అందరికీ స్వచ్ఛమైన పాలన కావాలంటే టిడిపి మిత్ర పక్షాలను గెలిపించాలని టిడిపి నాయకులు కోరారు. మండలంలోని అన్నదేవరపేటలో టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు పోటీ చేస్తున్నారని ఆయనను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య, కొటారు వెంకట్రావు, యువగళం నాయకులు పాల్గొన్నారు.

పింఛను కోసం పడిగాపులు

ప్రజాశక్తి - యంత్రాంగం

పింఛను కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. వారికి సరైన సమాచారం లేకపోవడంతో ఉదయం నుంచే సచివాలయాలకు క్యూ కట్టారు. మధ్యాహ్నం నుంచి అందిస్తారని తెలియజేయడంతో చేసేది లేక అక్కడే పడిగాపులు కాశారు. వృద్ధులు ప్రయాణాలు చేయలేక ఇబ్బందులకు గురయ్యారు. కడియం మండలంలో బుధవారం సాయంత్రం 5 గంటల నుం ప్రారంభమైనట్లు ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ తెలిపారు.. మొదటి రోజు 3,100 మందికి పెన్షన్లు అందించామన్నారు. పెన్షన్ దారులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరోగ్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. **గోకవరం** మండలంలో చాలా మంది పింఛనుదారులు ఉదయమే సచివాలయాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం అయినా పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో వెనుదిరిగారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పింఛన్ల నగదు ఇంకా క్రెడిట్ కాకపోవడం వల్ల ఆలస్యమైందన్నారు. **చాగల్లు** మండలంలో పింఛను కోసం లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు.సమాచారం తెలియకపోవడంతో ఉదయం నుంచే సచివాలయాల బాటపట్టారు. గంటలపాటు పింఛను కోసం పడిగాపులు కాశారు. ఎంపిడిఒ నాతి బుజ్జి మాట్లాడుతూ ప్రతి సచివాలయం వద్ద రెండు నుంచి మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి పింఛన్ల పంపిణీ చేపడతామన్నారు. వికలాంగులు, వృద్ధులకు ఇంటికి వెళ్లి పింఛను అందిస్తామన్నారు. మొదటి రోజు 3,155 మందికి పింఛన్లు అందించామన్నారు. తాళ్లపూడిలో బుధవారం సాయంత్రం వరకూ పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. దీంతో చాలా మంది వెనుదిరిగారు. మొదటి రోజు కొంత మంది మాత్రమే పింఛను అందుకున్నారు. **ఉండ్రాజవరం** పింఛను దారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సచివాలయ సిబ్బంది ద్వారా, సచివాలయాల వద్ద పెన్షన్లు పంపిణీ చేస్తామని, ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎంపిడిఒ కె.నరేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. పెన్షన్ల పంపిణీపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రశ్నించగా వికలాంగులు, తీవ్ర అనారోగ్యం పాలైన వారు, వీల్ చైర్‌కు పరిమితమైన, సైనిక్ వెల్ఫేర్ పెన్షనర్లకు సిబ్బంది ద్వారా ఇంటివద్దే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సచివాలయం వద్దకు వచ్చే పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు. కుర్చీలు, షామియానాలు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. పెన్షన్ దారుడు తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. 6వరకూ నాలుగు రోజులపాటు పంపిణీ జరుగుతుందన్నారు. మండలంలో మొత్తం పెన్షన్ దారులు 10,645 మంది ఉన్నారన్నారు. బ్యాంకు నుంచి డబ్బులు తెచ్చేందుకు ఆలస్యమైంది, 3 గంటల నుంచి పంపిణీ చేపట్టామని తెలిపారు. అయితే కొన్ని చోట్ల సాయంత్రం 4 గంటలైన పింఛను పంపిణ చేయకపోవడంతో పలువురు వెనుదిరిగారు.



గోకవరంలో వెనుదిరుగుతున్న వృద్ధులు



తాళ్లపూడిలో పింఛను కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం బ్రహ్మల కాలనీలో ఎంపిపి నిధులు రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర శ్రీవల్లి, వైసిపి నాయకుడు సుంకర వీరబాబు మాట్లాడారు. ఎన్నికల కోడ్ రాక ముందే సిసి రోడ్డు నిర్మాణానికి వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి తోట నరసింహం ఆదేశాలు మేరకు శంకుస్థాపన చేశామన్నారు. ఇంతవరకూ రోడ్డు లేక కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. తమ దష్టికి తీసుకు రావడంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు.

నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వైసిపి పాలనలో నిరుద్యోగులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని బిఎస్‌పి నిడదవోలు నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేను అన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారన్నారు. జాబ్ క్యాలెండర్‌లేదని సాక్షి పేపర్ క్యాలెండర్ మాత్రమే తప్పనిసరిగా వస్తుందని ఎద్దేవా చేశారు. ఉండ్రాజవరంలో ఆయన బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పి గెలిచిన తరువాత దాని మాటే మరిచారన్నారు. మణిపూర్ ఘటనలో సైతం అధికార, ప్రతిపక్ష పార్టీల అధినేతలిద్దరూ ప్రధాని నరేంద్రమోడీని సమర్థించడం దారుణం అన్నారు. ఉచిత పథకాలతో ప్రజలను ప్రభుత్వంపై ఆధారపడేలా పథకాలు కొనసాగిస్తున్నారన్నారు. నాణ్యతలేని మద్యంతో పేదలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇటువంటి పాలకులను తరిమికొట్టి, పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం బహుజన సమాజ్ పార్టీని రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్రి మహాలక్ష్ముడు, నల్లి రమేష్, బత్తిన ఆశీర్వాదం, గుమ్మాపు శ్రీను, కప్పల ఇజ్రాయిల్, అంబటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కడియం బిఎంపి అధ్యక్షులుగా ప్రసాదు

ప్రజాశక్తి - కడియం


కడియం మండలం బిఎంపి కార్యవర్గం అధ్యక్షులుగా బిఎస్‌వి.ప్రసాదు, ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.గోవిందు, కోశాధికారిగా ఎస్‌కె.రహీమ్, గౌరవ సలహాదారులుగా వై.శరభయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా స్థానిక ఉన్నత పాఠశాలలో పి రాజకుమార్, మధుసూదన్ రెడ్డి, వై శరభయ్య ఆధ్వర్యంలో మండల బిఎంపిల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిఎంపి రాష్ట్ర అధ్యక్షులు లంక సత్యనారాయణ, కొమ్మ శ్రీనివాస్, గౌరీష్ బాబు, పక్కుర్తి సత్యనారాయణ, జీవీఎస్ గైనిక్ హస్పటల్ వైద్యులు రామ్ గోపాల్ తేజ, పి మాణిక్యాంబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్ తేజ మాట్లాడుతూ గుండెపోటుకి గ్యాస్ నొప్పి మధ్యగల వ్యత్యాసం వివరించారు. బిఎంపి వైద్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం వైద్యులు రామ్‌గోపాల్‌తేజను, మాణిక్యాంబను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడియం, రాజానగరరం, రంగంపేట మండలాల బిఎంపిలు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి మంచి లక్షణాలు కలిగి ఉండాలని, మహిళలను గౌరవించాలని, మతసామరస్యాన్ని పాటించాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. చత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పరులపట్ల శివాజీ చూపించిన ఆదరాభిమానాలను సద్గుణాలను నేటి విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కార్టూ'నిజం'



నన్నయ ఎఫ్ఒ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ కొత్తపూడి శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. యూనివర్సిటీ సెమినార్ హాల్లో ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. విసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు ఎఫ్ఒ శ్రీనివాసరావు సేవలను ప్రశంసించి అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 37 ఏళ్ల పాటు ప్రభుత్వ ఖజానా అధికారి బాధ్యతలలో శ్రీనివాస రావు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఆర్థిక అధికారిగా సౌమ్యవర్తనతో, నిర్వహణ దక్షతతో, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరి మన్ననలు పొందారన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. విశ్వవిద్యాలయంలో ఆగిపోయిన భవన నిర్మానాలను పున:ప్రారంభించేందుకు సహకరించారని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ 1987 లో జూనియర్ గణకునిగా ఉద్యోగ జీవితంలో ప్రవేశించినది మొదలు క్రమక్రమ వికసితోద్భాసిత ప్రతిభా సమన్వయ ప్రభలతో 1994లో సీనియర్ గణకునిగా పదోన్నతిని, 2007లో ఉప ఖజానా అధికారిగా, 2014లో సహాయ ఖజానా అధికారిగా, 2022 నుండి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్థిక అధికారిగా ఉద్యోగాలు నిర్వహించారన్నారు. సన్మాన గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టపడి పని చేస్తేనే విజయం దక్కుతుంది అని తన తండ్రి చెప్పిన మాటను విశ్వసిస్తూ 37 సంవత్సరాలు సర్వీస్ చేశానన్నారు. విసితో పాటు తోటి సిబ్బంది ఎంతో సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, ఎఆర్‌జి.చంద్రకళ, ఈసీ మెంబర్ పి.సురేష్‌వర్మ, సిఇ ఎస్.లింగారెడ్డి, డీన్ కె.శ్రీరమేష్, వై.శ్రీనివాసరావు, బి.జగన్మోహనరెడ్డి పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్పాట్ వ్యాల్యూయేషన్ కేంద్రంలో మూల్యాంకనంలో పాల్గొన్న సిబ్బందికి యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖ అధికారి నారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యుటిఎఫ్ సేవలను అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ షరీఫ్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దశ్య నేపథ్యంలో ఉపాధ్యాయులకు క్యాంప్ పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లక్ష్మీకుమారి, ం జిల్లా కోశాధికారి ఇవిఎస్‌ఎస్‌ఆర్.ప్రసాద్ జిల్లా కార్యదర్శులు కె.రమేష్‌బాబు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ నిలిపేయించిన నీచ చరిత్ర బాబుదే'

ప్రజాశక్తి-గోకవరం

పింఛనును నిలిపేయించిన నీచ చరిత్ర చంద్రబాబుదేనిని ఎస్‌సి సెల్ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి గుల్లా ఏడు కొండలు అన్నారు. ఆయన నివాశంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు, పెన్షన్ నిలిచిపోవడానికి కారణం చంద్రబాబు కాదా, వాలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదులు చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఐదేళ్లుగా వాలంటరీ వ్యవస్థ ప్రభుత్వం అమలుపరిచిన పనులను మాత్రమే నిర్వర్తించారన్నారు. పార్టీ పరంగా ప్రచారం కానీ పార్టీ కండువా, జెండా మోయలేదన్నారు. వారు ప్రభుత్వపరంగా తమ బాధ్యతను నిర్వర్తించారని తెలిపారు. టిడిపి నాయకుల కుట్రల వల్ల పింఛన్లను ఇంటి వద్ద పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వాలంటరీ వ్యవస్థను తప్పుదోవ పట్టించే విధంగా ఎన్నికల కమిషనర్‌కి ఫిర్యాదు చేశారని ఆరోపించారు.

నేరాలు ఘోరాలు

5 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన మానే మంగ ఐదు లీటర్ల సారాను విక్రయిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివారలు ఇవి. రావులపాలెం సిఐ శ్రీరామ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ యస్.శ్రీనివాసు సిబ్బంది మండలంలోని గ్రామాల్లో సారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అంకంపాలెం గ్రామ శివారున సారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన మానే మంగ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీన చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితురాలిని కొత్తపేట జెఎఫ్‌సిఎం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆమెకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు


నగదు స్వాధీనం చేసుకున్న ఎంపిడిఓ శ్యామ్ సుందర్

రూ.3 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

తగిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కాకినాడ ట్రెజరీలో జమ చేసినట్టు ఫ్లయింగ్ స్కాడ్ టీమ్ సామర్లకోట ఎంపిడిఒ దుర్గా శ్యామ్ సుందర్ చెప్పారు. మంగళవారం రాత్రి స్థానిక జి.రాగంపేట రోడ్ జంక్షన్ వద్ద మండలంలోని వేట్లపాలెంకు చెందిన బొడ్డు సంతోష కుమార్ నుండి రూ.3 లక్షలు నగదును సరైన ధృవీకరణ పత్రాలు ఇవ్వనందున స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ భవనం వద్ద గుర్తు తెలియని యాచకుడు మృతి చెంది ఉండగా గ్రామస్తులు గుర్తించి పంచాయతీ అధికారులకు తెలియజేశారు. పంచాయితీ కార్యదర్శి భార్గవ్, విఆర్ఒ వీరబాబు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి ప్రతి శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, యాత్రికులను యాచిస్తూ జీవనం గడుపుతుంటాడని, అతని వివరాలు తెలియవని స్థానికులు తెలిపారు.

పట్టుబడ్డ వాహనంపై కేసు నమోదు

ప్రజాశక్తి-పిఠాపురం

పాదగయ సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక వాన్‌ను పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా వైసిపి చెందిన జెండాలు, పోస్టర్లు, టోపీలు, డమ్మీ ఇవిఎంలు ఉండడాన్ని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఎ ఎస్వీఎస్ఎన్ వర్మ అక్కడికి చేరుకుని వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రవాణాకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. డ్రైవర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుంచి తుని వైపు ఎన్నికల ప్రచార సామగ్రి తీసుకు వెళ్తున్నారని ఎన్నికల సామాగ్రి రవాణాకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో సామగ్రి అక్రమంగా రవాణా చేస్తున్నారని గుర్తించి డ్రైవరు, వాహనంపై ఎన్నికల నియమావళి అనుసరించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

భార్యను వేధించిన కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-పిఠాపురం

వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విదిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి బుధవారం తీర్పు చెప్పారు. పట్టణంలోని అగ్రహారానికి చెందిన ఎ.కామరాజు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని ఆయన భార్య కుమారి 2018లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ పి.శోభన్ కుమార్ కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఎపిపి ఎ.నాగ లీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

ఎన్‌టి.రాజాపురం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో యర్ర అప్పలనరస కుమార్తె సత్య మణికంఠ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్టు ఆమె తల్లి ఫిర్యాదు ఇచ్చారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

జగన్నాథపురం వద్ద 50 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్టు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. బుధవారం మండలంలోని జగన్నాథపురంలో చెక్‌పోస్టు వద్ద పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేటకి చెందిన చిక్కాల సాయి సతీష్ బైకుపై 50 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేశామని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. తనకు వచ్చిన సమాచారం మేరకు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్న చాగల్లు గ్రామానికి చెందిన కలేరియా మంగారావు అరెస్టు చేశామన్నారు. అతని నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎంఎల్ఎ వద్ద సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి - తాళ్లపూడి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తలారి వెంకట్రావు

తాళ్లపూడిలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు వద్ద ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తాళ్లపూడిలో బుధవారం ఆయన ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వాటర్లను కలుస్తూ వారికి అందుతున్న పథకాలను తెలుసుకుంటూ కరపత్రాలను అందజేశారు. ఈ క్రమంలో సొంత పార్టీకి చెందిన వ్యక్తులే స్థానిక నాయకత్వంపై ఆరోపణలు చేశారు. మాజీ ఎంపీటీసీ కోదాటి సత్యనారాయణ మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన వ్యక్తులే సర్పంచి పదవిలో ఉన్నప్పటికీ పుష్కర్ ఘాట్ వీధిలో అభివృద్ధి జరగలేదన్నారు. చిన్నపాటి చినుకు పడిన తమ వీధులు మునిగిపోతున్నాయని గోదావరి కుడిగట్టు ప్రక్కనగల ప్రజలు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. రోడ్లు వేయమని కోరిన పట్టించుకోవడంలేదని ముస్లిం కుటుంబాలు వాపోయారు. ఎంఎల్ఎ అభ్యర్థి మాత్రం అభివృద్ధికి హామీలు ఇస్తూ ఆశీర్వాద యాత్ర కొనసాగించారు. ఈ ప్రజా ఆశీర్వాద యాత్రలో తలారి వెంట వైకాపా మండల శాఖ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు జడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ వైకాపా నాయకులు నక్కా చిట్టిబాబు తదితర నాయకులు ఉన్నారు.

పలువురు వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - యంత్రాంగం


కడియంలో రాజానామా పత్రాలు చూపుతున్న వాలంటీర్లు

జిల్లాలో పలువురు వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. **కడియం** మండలం మాధవరాయుడుపాలెం, కడియం, వేమగిరి గ్రామాలకు చెందిన, 42 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. మాధవ రాయుడుపాలెంలో 30 మంది, కడియంలో 10 మంది, వేమగిరిలో ఇద్దరు వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీ నామా పత్రాలను ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్‌కు అందచేశారు. జేగురుపాడులో రెండు సచివాలయాలకు చెందిన 33 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. కడియం మండల ప్రజా పరిషత్ ఎఒ సుబ్బారావు, గ్రామపంచాయతీ కార్యాదర్శి బి.శిరీషకు రాజీనామా పత్రాలను అందించారు. **గోపాలపురం** మండలంలో పనిచేస్తున్న 34 మంది గ్రామ వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలు అందించినట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న వాలంటీర్లు స్వచ్ఛంద రాజీనామా పర్వం కొనసాగుతుంది. మండలంలో 271 మంది 18 గ్రామ సచివాలయంలో పరిధిలో పనిచేస్తున్నారు. కోమటికుంట గ్రామానికి చెందిన వాలంటీర్లు, గోపాలపురం గ్రామాలకు చెందిన సుమారు 34 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలు ఎంపీడీవో రమేష్ కు అందిస్తున్నామని తెలిపారు. **తాళ్లపూడి** మండలంలో మలకపల్లికి చెందిన 16 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో రమణకు అందజేశారు.

సీతానగరంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్నికల అధికార ఆదేశాలతో డ్వామా పీడీ ముఖలింగం బుధవారం సీతానగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు, జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్లలో మట్టి తోలకాలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేశారు. 33 పనులకు సంబంధించి స్థానిక రైతుల నుంచి మట్టిని సేకరించినట్లు బిల్లులు చేసేశారు. ఇప్పటివరకు రైతుల అకౌంట్లలో బిల్లులో డబ్బులు జమ కాలేదు. స్థానిక మండల ఉపాధి హామీ పథకం అధికారి రైతులకు బిల్లులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించారు. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఆ నిధులు రైతులకు చేరకుండా మండలంలో పలువురు స్థానిక వైకాపా నాయకులకు చేరాయని, ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడానికి ఆ నిధులు ఉపయోగించి ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు, తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ ముఖలింగం సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్న ఉపాధి హామీ విభాగంలో 33 పనులకు సంబంధించి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులను పరిశీలించి కలెక్టర్‌కునివేదిక అందిస్తామన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - గోపాలపురం


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మండలంలోని గోపవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 91వ పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒలు జి. శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు మాట్లాడుతూ నేడు కార్పొరేట్ స్కూల్స్‌కి దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. చక్కటి క్రమశిక్షణ, క్వాలిటీ ఎడ్యుకేషన్ తదితర అంశాలకు ప్రభుత్వ పాఠశాలలే దేశానికి పట్టుగొమ్మలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. పాఠశాలలోని విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ పూలపల్లి పండు, ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు కాశీ విశ్వేశ్వరరావు, ఫణికుమార్ శర్మ, భాస్కరరావు, షేక్ ఇమామ్, సిఆర్పి కొయ్య నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెషల్ పార్టీ సిబ్బందికి యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే స్పెషల్ పార్టీ సిబ్బందికి బుధవారం యూనిఫామ్, షూ, కిట్ బ్యాగ్‌లను ఎస్‌పి జగదీష్ బుధవారం అందించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముగ్గురు ఇన్చార్జిలు, 45 సిబ్బందితో, ప్రతి టీమ్‌కి ఒక ఇన్‌ఛార్జి, 15 మంది సిబ్బంది ఉండేలా 3 స్పెషల్ పార్టీలను ఎస్‌పి ఏర్పాటు చేశారు. వారితో ఎస్‌పి ముఖాముఖి మాట్లాడారు. వారి విధులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్‌పి పి.అనిల్‌కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి ఎల్.చించిరెడ్డి, ఎస్‌బి డిఎస్‌పి డి.ప్రభాకర్, ఎఆర్ డిఎస్‌పి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తా...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తాము అధికారంలోకి వస్తే రాజమండ్రి నగరానికి పూర్వ వైభవం తీసుకొస్తానని టిడిపి సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం 37వ డివిజన్‌లో ఉర్లంకల లోకేష్ ఆధ్వర్యంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు తదితరులతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామన్నారు. ఎంఎల్‌ఏగా తనను గెలిపిస్తే నగరానికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు, నగరాభివృద్ధి, ప్రజల అభిప్రాయాలతో పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్.వెంకటేష్, ఎల్.రాజేష్, కిలాని శ్రీనివాస్, ఎం శామ్యూల్, డి వంశీ, వారాధి రమణ తదితరులు పాల్గొన్నారు.

వీరలంకపల్లిలో లక్ష్మీదేవి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని వీరలంకపల్లి, బాబాజీపేట గ్రామాల్లో జ్యోతుల లక్ష్మీదేవి ఆమె తనయుడు అనీష్ నెహ్రూ ఇంటింటికి వెళ్లి టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి జనసేన ప్రవేశపెట్టిన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త కమలాదేవి చటోపాధ్యాయ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

1903 ఏప్రిల్ 3న మంగుళూరులో జన్మించిన కమలాదేవి చటోపాధ్యాయ భారతీయ హస్తకళల అభివద్ధికి జీవితాంతం కృషి చేశారని సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కమలాదేవి చటోపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. సంగీత నాటక అకాడమీ, కేంద్ర కుటీర పరిశ్రమల ప్రదర్శనశాల, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలకు శ్రీకారం చుట్టిన మేధావి కమలాదేవి అని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.


జి.మామిడాడలో పర్యటిస్తున్న నల్లమిల్లి

జి.మామిడాడలో నల్లమిల్లి పర్యటన

ప్రజాశక్తి-పెదపూడి

తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం దక్కకపోవడంతో మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ యాత్ర బుధవారం గొల్లల మామిడాడలో సాగింది. కుటుంబ సమేతంగా తన పాదయాత్రను ఆయన కొనసాగించారు. తన సీటు విషయంలో జరిగిన అన్యాయంపై 'న్యాయం కోసం నల్లమిల్లి' కార్యక్రమంలో భాగంగా నల్లమిల్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జుత్తుక కృష్ణ, సూర్య కుమారి, తమలపూడి శివరామరెడ్డి, వాసంశెట్టి శ్రీనివాసు, సూరిబాబు పలివెల బుజ్జి, గంట రాజు పాల్గొన్నారు.

వైసిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గిడజాం, ఎ.మల్లవరం గ్రామాల్లో వైసిపి ప్రత్తిపాడు నియోజవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు బుధవారం పర్యటించారు గిడజాం గ్రామంలో బండారు బైరాగి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వనిమిన రాజుతో పాటు 20 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి వరపుల ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో శంకవరం ఎంపిపి పర్వత రాజుబాబు, వైసిపి మండల అధ్యక్షుడు తాతాజీ, ఎస్.శ్రీను, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధర్మారావుకు పలువురి అభినందన

తాళ్లరేవు : కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ టికెట్ లభించిన మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పాలెపు ధర్మారావును పలువురు అభినందించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం సుమారు పది మంది పోటీ పడగా ధర్మరావును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధినాయకత్వం ఎంపిక చేసింది. కాంగ్రెస్ పార్టీ తరపున 1985లో ఆయన ఏకగ్రీవంగా ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. 2005 కాంగ్రెస్ పార్టీ జెడ్‌పిటిసిగా గెలుపొందారు. పార్టీలో జిల్లా స్థాయిలో క్రియాశీలక పదవులు నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ సామాజిక వర్గానికే చెందిన ధర్మారావుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబుపై వైసిపి తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి - జగ్గంపేట

టిడిపి అధినేత చంద్రబాబుపై సిఎం జగన్ నుంచి వైసిపి అభ్యర్థుల వరకు తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని, వాటిని నమ్మవద్దని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వద్ద సొమ్ములు లేక ఇప్పటి వరకు బ్యాంకుల్లో నగదు జమ కాలేదన్నారు. సొమ్ములు లేకే పెన్షన్లు ఆలస్యం అయ్యాయని, చంద్రబాబు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం వల్ల పెన్షన్ల పంపిణీ ఆలస్యం అయ్యిందనడం వాస్తవం కాదన్నారు. నిబంధనల ప్రకారం పెన్షన్ల పంపిణీలో వాలంటీర్లను నిలుపుదల చేశారని తెలిపారు. చంద్రబాబు ఫిర్యాదుతో వారిని అపలేదన్నారు. కేవలం వైసిపి దుష్ప్రచారం చేస్తుందని, పింఛన్లు పంపిణీ చేయాలనే చిత్తశుద్ధి ఉంటే 30వ తేదీన డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేవారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కొత్త కొండబాబు, శీలామంతుల వీరబాబు, పాండ్రంకి రాంబాబు, పాల్గొన్నారు.

యానాం వార్తలు


నాయకులను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభిమానులు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - యానాం

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యానాంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వి.వైథిలింగం అన్నారు. యానాంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి తదితర నాయకులతో కలిస వైథిలింగం ప్రచారం చేశారు. తొలుత భూసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బాలయోగి స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నారాయణస్వామి ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రోడ్ షో, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈరోడ్ షోలో వైథిలింగం మాట్లాడుతూ యానాంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి కోసం వలసబాట పట్టారని తెలిపారు. స్టేట్ బ్యాంక్ రోడ్, పిల్లారాయ వీధి, చిన్న సెంటర్, అంబేద్కర్ సర్కిల్, మెట్టకూరు, గోపాల్ నగర్ , కనకాలపేట, యుకెవి నగర్, భీమ్ నగర్ మీదుగా సావిత్రి నగర్ చేరుకుని అక్కడ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్, స్థానిక నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, దవులూరి పతి, చక్రవర్తి, బీరాస్వామి, విళ్ల చిన్ని శ్రీవారి, లంక బంగారం, శ్రీధర్, రామకష్ణ, ప్రసాద్ రాజు, మున్నా, గణేష్, జాన్ పాల్గొన్నారు.

నవోదయకు 28 మంది రీజెన్సీ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - యానాం

2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక రిజన్సీ పబ్లిక్ స్కూల్ నుంచి 59 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాద్ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యానాం రీజియన్‌లో రీజన్సీ పబ్లిక్ స్కూల్ నుంచి అత్యధికంగా ఎక్కువమంది విద్యార్థులు నవోదయకు ఎంపిక అవడంపై విద్యార్థులను రీజన్సీ సిరామిక్స్ లిమిటెడ్ ఎండి ఎన్.సత్యేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు అభినందనలు తెలిపారు.